ఆలస్యంగా నడిచిన రైళ్లు

ములకలచెరువు, న్యూస్‌టుడే : ములకలచెరువు రైలు నిలయానికి శనివారం గుంతకల్లు నుంచి తిరుపతి మీదుగా నడిచే పలు రైళ్లు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సికింద్రాబాద్- తిరుపతి సెవెన్ హిల్స్ రైలు అర్ధరాత్రి 2.49 గంటలకు రావాల్సి ఉండగా తెల్లవారుజామున 4.49 గంటలకు రావడంతో రెండు గంటలపాటు ఆలస్యంగా నడిచింది. నరసాపూర్- ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 6.49 గంటలకు రావాల్సి ఉండగా, ఉదయం 7.49 గంటలకు రాగా, గంట ఆలస్యంగా నడిచింది. తిరుపతి-గుంతకల్లు కూడలి ప్యాసింజరు రైలు అర్ధరాత్రి 1.49 గంటలకు రావాల్సి ఉండగా, తెల్లవారుజామున 3.19 గంటలకు రావడంతో గంటన్నర పాటు ఆలస్యంగా నడిచింది. గుంతకల్లు-తిరుపతి ప్యాసింజర్ రైలు ఉదయం 10.39 గంటలకు రావాల్సి ఉండగా, 11.53 గంటలకు వచ్చింది.

ఈనాడు అన్నమయ్య



చెర్లోపల్లెలో గాయత్రీదేవిగా శ్రీరెడ్డెమ్మ



రాజంపేట సాధుకామాక్షమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



కలికిరి శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన అమ్మవార్లు

అన్నపూర్ణాదేవి... పాహిమాం!

జిల్లావ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి ఇందులో భాగంగా మూడో రోజు శనివారం ఆలయాల్లోని అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళాభక్తులు కుంకుమార్చనలు చేశారు. పలు చోట్ల సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే, బృందం**

వారి పాపాలే వీరికి శాపాలై!

ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది బలి

మైదుకూరు, వీరబల్లి మండలాల్లో వైకాపా నేతల అక్రమాలు

- ఈనాడు, కడప



గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు చేయించిన పాపాలు రెవెన్యూ శాఖ అధికార యంత్రాంగానికి చుట్టుకున్నాయి. ప్రయోగాత్మకంగా చేయించిన విచారణలో పాపాల పుట్టలు పగులుతున్నాయి. అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల అంతటా విచారణ చేపట్టే పక్షంలో ఎవరూ మిగిలేలా కనిపించడంలేదు. ఇప్పటికే వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు మండలంలో తహసీల్దారు సహా 15 మంది రెవెన్యూ సిబ్బందికి సంజాయిషీ తాఖీదులు జారీ చేశారు. వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే దిశగా మొదటి దశ ప్రక్రియ చేపట్టారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలోనూ ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో సగానికి పైగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు విచారణలో తేలింది. ఇక్కడ కూడా ప్రక్రియ జరిగినప్పుడు పనిచేసిన తహసీల్దారు, సిబ్బందిని బాధ్యులను చేసే అవకాశం ఉంది. వీరికి కూడా ఒకట్రెండు రోజుల్లో సంజాయిషీ తాఖీదులు జారీ చేయనున్నట్లు జిల్లా ఉన్నతాధికార వర్గాలు తెలిపాయి.

● వీరబల్లి మండలంలో 4,774 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించగా, వాటిలో 2,022 ఎకరాల వరకు నిబంధనలకు విరుద్ధంగా చేసినట్లు విచారణలో తేలింది. ఫ్రీహోల్డ్ చేసిన భూములను 266 రిజిస్ట్రేషన్లు జరగ్గా, వీటిలో నిబంధనలకు విరుద్ధంగా 95 వరకు అక్రమంగా జరిగినట్లు వెల్లడైంది.

● వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు మండలంలో 2,788 ఎకరాలను నిషిద్ధ జాబితా నుంచి తొలగించగా, 576 ఎకరాల వరకు అక్రమంగా తొలగించినట్లు గుర్తించారు. ఏకంగా తెలుగుగంగ, జాతీయ రహదారులు, నివాసం ఉన్న ఇళ్ల స్థలాలను సైతం ఫ్రీహోల్డ్ జాబితాలో కలిపేసినట్లు తేలింది.

● వైకాపా నాయకులు భూములతో అవసరం లేకుండా తమ ఖాతాలో విస్తీర్ణం చూపించుకునే ఎత్తుగడలో భాగంగా భూదందా సాగించినట్లు తెలుస్తోంది. భూములను తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం, ఇతరత్రా అవసరాలకు దస్త్రాలు వాడుకుంటున్నట్లు విచారణలో తేలింది. అక్రమాలపై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోదియా కఠినంగా వ్యవహరిస్తున్నారు. తరచూ పర్యవేక్షిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మైదుకూరులో ప్రభావిత గ్రామాలు : వనిపెంట, నంద్యాలంపేట, గంజికుంట, మిట్టమానుపల్లె, శెట్టివారిపల్లె, తిప్పిరెడ్డిపల్లె, మాదిరెడ్డిపల్లె, అద్దిరెడ్డిపల్లె, గదమాయపల్లె, అన్నలూరు, శివపురం, ఎస్.మైదుకూరు, ఎన్.మైదుకూరు, సోమయాజులపల్లెలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. నంద్యాలంపేట, వనిపెంట, అన్నలూరు, శెట్టివారిపల్లెలో ఎక్కువ విస్తీర్ణంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు తేలింది.

తాఖీదులందుకున్న వీఆర్వోలు : జె.రామలక్ష్మమ్మ, ఎ.వెంకటసుబ్బయ్య, బి.బాలనరసింహారావు, పి.ఓబుల్‌రెడ్డి, వై.ఓబులేశు, బి.మధు దేవిడ్, టి.మంజులాదేవి, ఎస్వీ నాగేంద్ర, బి.ప్రతాప్‌లు ఉన్నారు. వీరిలో పలువురు ఒకటి కంటే ఎక్కువ గ్రామాలకు వీఆర్వోలుగా వ్యవహరిస్తున్నారు. తాఖీదులు అందుకున్న సిబ్బంది పని దినాల్లో రెండు రోజుల వ్యవధిలో రాతమూలకంగా సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫ్రీహోల్డ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

పీలేరు, న్యూస్‌టుడే: ఫ్రీ హోల్డ్ దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని హంద్రీనీవా డిప్యూటీ కలెక్టర్ రమ స్పష్టం చేశారు. పీలేరు రెవెన్యూ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... పీలేరు మండలంలో 2003 సంవత్సరానికి ముందు ఇచ్చిన డీకేటీ భూములను ఫ్రీహోల్డ్ జాబితాలో చేర్చారని తెలిపారు. ఇప్పటివరకు 3,994 సర్వే నెంబర్లలోని 5,078 ఎకరాల భూములు ఫ్రీహోల్డ్‌లో ఉంచారన్నారు. సమావేశంలో తహసీల్దార్ భీమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రం: ఫ్రీహోల్డ్ దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. కాపులపల్లెలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు శనివారం సాయంత్రం ఆయన పరిశీలన చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఫ్రీ హోల్డ్ దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలనపై తహసీల్దార్ నిర్మలాదేవి, వీఆర్వోలతో చర్చించారు. నారిగానిపల్లె, కురిజల, మినికి రెవెన్యూ గ్రామాల్లో పరిశీలన పూర్తి చేయాలని సూచించారు.

స్కానింగ్ కేంద్రాలకు అనుమతి తప్పనిసరి

పీలేరు, న్యూస్‌టుడే: స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా జిల్లా అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని పీసీపీఎన్‌డీటీ చట్టం జిల్లా నోడల్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ స్పష్టం చేశారు. పీలేరు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్కానింగ్ కేంద్రం వద్ద లింగ నిర్ధారణ చేయబడదని ఫ్లెక్సీని కూడా అందరికీ కనిపించేటట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. లింగనిర్ధారణ చేస్తే జరిమానాతో పాటు జైలుశిక్ష విధించడంతో పాటు కేంద్రం రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డాక్టర్ సరస్వతి, స్కానింగ్ కేంద్రాల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

పురుషుల ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పురుషుల ఫుట్‌బాల్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దిలీప్‌కుమార్, కార్యదర్శి మురళీధర్ తెలిపారు. శనివారం జరిగిన ఈ ఎంపికకు జిల్లా నుంచి 35 మంది హాజరు కాగా వారిలో 22 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. వీరు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా తరపున పాల్గొంటారన్నారు. జట్టు కెప్టెన్‌గా మహేంద్రనాయక్, కోచ్‌గా విజయ్, మేనేజర్‌గా ఉదయ్‌కుమార్‌ను నియమించినట్లు వారు తెలిపారు.

గిరిజనులకు కొండంత భరోసా!

జిల్లాలో 17 గ్రామాల్లో పీఎంజే యూజీఏ అమలుకు ప్రణాళికలు

-న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

గిరిపుత్రులను ఉపాధి కల్పించి జీవనోపాధి బలోపేతం కల్పించాలని సదాశయంతో కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్‌ను త్వరలో అమలు చేయాలని ఇప్పటికే కసరత్తు చేశారు. దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న గ్రామాలను ఎంపిక చేశారు. కొండంత భరోసా ఇచ్చేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

★ జిల్లాలో వెనుకబడిన 4 మండలాల్లో 17 గ్రామాలను అధికారులు ఎంపిక చేశారు. పెనగలూరు మండలం చినరాయసముద్రం, రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట, రామవరాజుపురం, వి.కండ్రిక, ఓబన్నపల్లి, చియ్యవరం, రైల్వేకోడూరు తూర్పు, పశ్చిమ, ఉప్పరపల్లి, శెట్టిగుంట, కురబలకోట మండలం ముదివీడు, మట్లివారిపల్లె, కురబలకోట, తెట్టు, అంగళ్లు, లక్కిరెడ్డిపల్లె మండలం బి.ఎర్రగుడి, లక్కిరెడ్డిపల్లె గ్రామాలపై అధికారులు దృష్టిసారించారు. ఆయా గ్రామాల్లో 2011 జనాభా లెక్కల మేరకు 34,690 మంది ఉండగా, ఎస్టీలు 50 శాతానికి పైగా ఉన్న గ్రామాలను ఎంపిక చేశారు.


రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట గిరిజన కాలనీ

కల్పించనున్న సౌకర్యాలు...

★ సొంతిల్లు లేనివారికి పక్కాగృహం మంజూరు ★ రహదారులకు మరమ్మతులు ★ ప్రతి గడపకు రక్షిత జలాల సరఫరా ★ విద్యుత్తు సరఫరా మెరుగుదల ★ సౌర వెలుగుల పరికరాల పంపిణీ ★ మెరుగైన వైద్య సేవలు ★ ఆయుష్మాన్‌భవ కార్డుల పంపిణీ ★ గ్యాస్ కనెక్షన్ మంజూరు ★ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, పౌష్టికాహారం పంపిణీ ★ అవసరాన్ని బట్టి వసతి గృహాల ఏర్పాటు ★ నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ★ రైతులు, పశుపోషకులు, మత్స్యకారులకు రాయితీపై సంక్షేమ పథకాలు ★ టెలికం, డిజిటల్ సేవల విస్తరణ ★ మార్కెటింగ్‌పై అవగాహన కల్పన

ప్రణాళికలు రూపొందిస్తున్నాం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్‌లో గిరిజన గ్రామాలను ఎంపిక చేశాం. సంక్షేమ, అభివృద్ధి పథకాలపై దృష్టిసారించాం. ఎస్టీలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఉన్నత స్థాయి నుంచి అనుమతులు రాగానే అమలు చేస్తాం.

- తేజస్విని, జిల్లా గిరిజన అధికారిణి

కడపలో లలితా జ్యువెలరీ షోరూం ప్రారంభం

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే : కడప నగరంలో శనివారం లలితా జ్యువెలరీ షోరూం ప్రారంభమైంది. సంస్థ ఎండీ కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేయగా, ఎమ్మెల్యే మాధవిరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... 56వ బ్రాంచిని కడప నగరంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఏ, బీ టౌన్‌లకు మాత్రమే పరిమితమైన లలిత జ్యువెలరీని త్వరలో సీ టౌన్‌లో కూడా ప్రారంభిస్తామన్నారు. ప్రతి షోరూంలో మహిళలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఒక దుకాణాన్ని పూర్తిగా మహిళలతోనే ఏర్పాటు చేయాలనే ఉద్దేశంలో ఉన్నామన్నారు. బంగారం, వజ్రాలు, వెండి వస్తువులు కొనుగోలు చేసేవారు నాణ్యత గురించి ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం ప్రాంతాల వారీగా అభివృద్ధి కోరుకుంటోందని, ఉత్సాహవంతులైన పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తోందన్నారు. కడపకు మరిన్ని వ్యాపార సంస్థలు రావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. లలిత జ్యువెలరీ కడప నగరానికి రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం శ్రీనివాసరెడ్డి దంపతులను కిరణ్‌కుమార్ శాలువాలు కప్పి సత్కరించారు.


జ్యోతి వెలిగిస్తున్న లలితా జ్యువెలరీ ఎండీ కిరణ్‌కుమార్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

తహసీల్దారును తిట్టిన తెదేపా నాయకుడి అరెస్టు

తంబళ్లపల్లె నుంచి పలు ఠాణాలకు తరలింపు ● అన్నగారిపల్లిలో భూవివాదమే కారణం ● మదనపల్లెలో కొండ్రెడ్డికి బెయిల్ మంజూరు

మదనపల్లె నేరవార్తలు, ములకలచెరువు, న్యూస్‌టుడే : తంబళ్లపల్లె మండలం, అన్నగారిపల్లిలో భూవివాదంపై తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డి సంబంధిత తహసీల్దారు హరికుమార్‌ను దుర్భాషలాడినట్లు ఫిర్యాదు అందడంతో శనివారం తెల్లవారుజామున ఇన్‌ఛార్జి ఎస్‌ఐ గాయత్రి అదుపులోకి తీసుకొని మదనపల్లెకు తరలించారు. కొండ్రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న అనుచరులు మదనపల్లెకు చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు కొండ్రెడ్డిని అక్కడి నుంచి ములకలచెరువుతో పాటు పలు పోలీస్‌స్టేషన్లకు తరలిస్తూ అనుచరులను పక్కదోవ పట్టించారు. దీంతో నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ హరిప్రసాద్ వివరాల మేరకు..

★ తంబళ్లపల్లె మండలం, అన్నగారిపల్లిలో పాఠశాల పరిసరాలలో సర్వే నెంబర్ 51లో 45 సెంట్ల ప్రభుత్వ సిలింగ్ భూమి ఉంది. ఈ భూమిని కొందరు ఆక్రమించుకొని గొర్రెల దొడ్లు, ఎరువుల దిబ్బలుగా ఉపయోగించుకుంటున్నారు. ఆ స్థలాన్ని శ్మశాన వాటికకు కేటాయించాలని గ్రామస్థులు పలుమార్లు అధికారులకు విన్నవించారు. ఈ విషయంపై తహసీల్దార్ స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి భూమిని గుర్తించి శుభ్రం చేయించారు. ఆ సమయంలో ఐదుగురు ఆక్రమణదారులు రెవెన్యూ అధికారులపై దూషణలకు దిగి పనులను అడ్డుకున్నారు. ఈ విషయమై ఆక్రమణదారులు తెదేపా నాయకుడు కొండ్రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన గురువారం సాయంత్రం తంబళ్లపల్లె తహసీల్దార్ హరిప్రసాద్ మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విధి నిర్వహణలో ఉండగా ఫోన్ చేసి దుర్భాషలాడడంతో ఈ విషయాన్ని తహసీల్దార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు కొండ్రెడ్డితో పాటు భూ ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు కొండ్రెడ్డిని అరెస్ట్ చేసి మదనపల్లెకు తరలించారు. పోలీసుల వెంబడి కొండ్రెడ్డి అనుచరులు భారీ ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. మదనపల్లెలో పెట్రోలు సీసాలతో ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి మదనపల్లె కోర్టుకు తరలించగా అక్కడ బెయిల్ మంజూరు కావడంతో ఆయన విడుదలయ్యారు.


కొండ్రెడ్డిని ఠాణాకు తీసుకొస్తున్న ఎస్.ఐ.

మదనపల్లెలో టమాట బోర్డు ఏర్పాటు చేయాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: టమాట పంట దిగుబడికి, ఎగుమతికి పేరుగాంచిన మదనపల్లెలో టమాట బోర్డును ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు రామిశెట్టి వెంకయ్య డిమాండ్ చేశారు. శనివారం నీరుగట్టువారిపల్లెలోని మామిడి మండీలో జిల్లా నాయకులు ఎండపల్లి వెంకటరమణ అధ్యక్షతన రైతుల సమస్యపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, టమాటా సీజన్‌కు సంబంధం లేకుండా కిలో రూ.20 గిట్టుబాటు ధరగా నిర్ణయించాలన్నారు. దీనిపై మార్కెట్ అధికారులు, సబ్ కలెక్టర్ చొరవ చూపాలన్నారు. ప్రస్తుతం ధరలు పెరిగాయని, పంట దిగుబడి పెరిగినప్పుడు ధరలు లేక రైతులు గిట్టుబాటు లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులు సాగుచేస్తున్న భూములను రెవెన్యూ అధికారులు కొందరు ఆన్‌లైన్‌లో ఇతరుల పేర్లు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. నిజమైన రైతుకు అన్యాయం జరిగితే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్, రైతు కూలీ సంఘం నాయకులు ఆంజనేయులు, నారాయణ, నాగప్ప, వెంకటస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర నేత రామిశెట్టి వెంకయ్య, పక్కన నాయకులు

ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

అపుస్మా సభలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కలికిరి ఆదీస్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో అపుస్మా అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉందన్నారు. అంతకు ముందు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీలేరు నియోజకర్గంలోని అపుస్మా అసోసియేషన్ సభ్యులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మంచి బోధనందిస్తున్న 31 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులతో సత్కరించారు. అనంతరం కిశోర్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అపుస్మా సభ్యులు విశ్వనాథరెడ్డి, రెడ్డిరఘునాథ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

కేకు కొందామని వెళ్లి కానరాని లోకాలకు...

తమ్ముడి పుట్టినరోజు నాడే అక్క మృతి


మేఘన (పాత చిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : సోదరుడి పుట్టిన రోజు వేడుకలకు కేకు కొందామని వెళ్లిన యువతి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడగా, ఆమె తండ్రి, సోదరుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ హృదయ విదారక ఘటన గుర్రంకొండ మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. తంబళ్లపల్లె మండలం కోటకొండ గ్రామానికి చెందిన బాబుకు కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు చెందిన కళావతితో 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె మేఘన (18), కుమారుడు కార్తిక్ ఉన్నారు. కొంతకాలం క్రితం కళావతి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఇద్దరు పిల్లలు రాయల్పాడులో ఉన్న తమ అవ్వ లక్ష్మీదేవి వద్దకు వెళ్లారు. బాబు విదేశాలకు వెళ్లి అక్కడ కూలి పనులు చేస్తున్నాడు. రెండేళ్ల క్రితమే అతను తిరిగి స్వగ్రామానికి వచ్చారు. మేఘన బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. కళాశాలకు సెలవు కావడంతో తండ్రిని చూసేందుకు కోటకొండకు వచ్చింది. శుక్రవారం సోదరుడి పుట్టిన రోజు కావడంతో కేకు తెచ్చేందుకు తండ్రి, సోదరుడితో కలసి గుర్రంకొండకు ఆటోలో వచ్చారు. ఆటో గుర్రంకొండలోని కోట సమీపంలోకి వచ్చే సరికి కుక్క అడ్డు రావడంతో డ్రైవర్ ఆటోను పక్కకు తిప్పాడు. దీంతో ఆటోలో కూర్చొని ఉన్న మేఘన కింద పడటం, ఆమెపై ఆటో పడటంతో తీవ్రంగా గాయపడింది. తండ్రి బాబు, సోదరుడు కార్తిక్ కూడా స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సాయంతో వారు మేఘనను ఆసుపత్రికి తరలించారు. మార్గం మధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రి శవగారానికి తరలించి శనివారం పరీక్షల అనంతరం బంధువులకు అప్పగించారు. సోదరుడి పుట్టినరోజు నాడే అక్క మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలముకుంది. గుర్రంకొండ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించాలి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : దేశవ్యాప్తంగా జనగణన చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకుడు కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 9వ తేదీ విజయవాడలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఉన్న బీసీ జనాభాను తేల్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు నామినేటెడ్ పదవుల్లోనూ, ఎన్నికల్లోనూ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. బీసీ జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాల్లో వారికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. 9వ తేదీ విజయవాడలో జరగనున్న మహాధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ... బీఎస్పీ చేపట్టనున్న మహాధర్నా కార్యక్రమానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పలువురు బీఎస్పీ నాయకులు రమణ, గంగాధర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

కేజీబీవీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

ముదివేడు (కురబలకోట), న్యూస్‌టుడే : కస్తూరిబా విద్యాలయాల్లో కనీస సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. కురబలకోటలో కస్తూర్బా విద్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాలను పరిశీలించి, వాటి పూర్తికి చర్యలు చేపట్టాలని సూచించారు. బోధన మెరుగుపరచాలని, ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థినుల్లో ప్రతిభ ఇనుమడిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు కొట్టివేత

రాయచోటి, గాలివీడు, న్యూస్‌టుడే: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడనే అనుమానంతో ఓ వ్యక్తిని స్నేహితులంతా కలిసి హత్య చేశారని అయిదేళ్ల కిందట గాలివీడు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించి శనివారం అయిదో జిల్లా న్యాయస్థానంలో విచారణ జరిగింది. అప్పట్లో గాలివీడు పోలీసులు నమోదు చేసిన హత్య కేసును కొట్టివేస్తూ జిల్లా అయిదో అదనపు కోర్టు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి తీర్పునిచ్చారు. గాలివీడు మండలం అరవీడుకస్బాకు చెందిన ప్యారంపల్లి వెంకటరమణ, షేక్ అమ్రుద్దీన్, షేక్ షబ్బీర్, షేక్ అల్లాబక్షులు స్నేహితులు. వెంకటరమణ మేస్త్రీగా పని చేస్తుండేవారు. తన స్నేహితులైన ముగ్గురిని అప్పుడప్పుడు ఇంటికి పిలిచి విందు ఏర్పాటు చేసేవారు. ఈ క్రమంలో వెంకటరమణ భార్య పట్ల అమ్రుద్దీన్ అసభ్యకరంగా ప్రవర్తించారని తెలుసుకున్నారు. దీంతో మిగిలిన ఇద్దరు స్నేహితులతో కలిసి 2018, ఫిబ్రవరి 18న విందు ఏర్పాటు చేశారు. బీరులో విషపు గుళికలు కలిసి అమ్రుద్దీన్‌కు ఇవ్వడంతో స్పృహ కోల్పోయి మృతిచెందారు. వెంకటరమణ తన స్నేహితులైన షబ్బీర్, అల్లాబక్షులతో కలిసి అతని మెడకు ఉరితాడు బిగించి చంపేశారని అప్పట్లో గాలివీడు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించి కేసు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా కోర్టులో నేరారోపణలు రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారని నిందితుల తరపున వాదించిన న్యాయవాదులు ఈశ్వర్, ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు.

ఆటో డ్రైవరుకు జైలుశిక్ష

సంబేపల్లె: మద్యం తాగి ఆటో నడిపిన ఆటో డ్రైవర్‌కు నెల రోజులు జైలు శిక్ష విధిస్తూ రాయచోటి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆసిఫా సుల్తానా శనివారం తీర్పునిచ్చారని సంబేపల్లె ఎస్సై భక్తవత్సలం పేర్కొన్నారు. ఇటీవల వాహనాల తనిఖీ సమయంలో మద్యం తాగి వాహనం నడుపుతూ వెంకటరమణ అనే డ్రైవర్ పట్టుబడ్డారన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి నెల రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారన్నారు.

ఎర్ర చందనం దుంగల స్వాధీనం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశామని పీలేరు సీఐ యుగంధర్ తెలిపారు. ఆయన కథనం మేరకు... కలకడ-పీలేరు మార్గంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా జరుగుతోందని అందిన సమాచారం మేరకు శనివారం వేకువజామున పొంతలచెరువు క్రాస్ వద్ద నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాయచోటి వైపు నుంచి వచ్చిన ఇన్నోవా కారు ఆపకుండా దూసుకెళ్లడంతో సిబ్బందితో వెంబడించినట్లు చెప్పారు. పొంతలచెరువు కట్టపైకి వెళ్లి వాహనాన్ని ఆపిన దుండగులు చీకట్లోకి పారిపోయారని వారిలో తమిళనాడుకు చెందిన అప్పాస్వామి కన్నన్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. వాహనంలో నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని పట్టుబడ్డ వ్యక్తిని రిమాండ్‌కు పంపామని సీఐ తెలిపారు. ఎస్.ఐ. బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


సునీత (పాత చిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మదనపల్లె మండలంలో శనివారం వెలుగు చూసింది. కొండామారిపల్లె పంచాయతీ బీఎన్‌రెడ్డి కాలనీకి చెందిన సునీత (48) తన ఇంట్లోనే మృతిచెందారు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఇంట్లో సునీత మృతదేహం ఉండటంతో విచారణ చేపట్టారు. మండలంలోని పుంగనూరువాండ్లపల్లెకు చెందిన సునీతకు 25 ఏళ్ల కిందట టేకులపాళ్యానికి చెందిన చలపతితో వివాహమైంది. వీరికి మానస, నాగ, కీర్తన పిల్లలున్నారు. వీరిలో మానస, నాగకు వివాహం కాగా, కీర్తన 9వ తరగతి చదువుతోంది. కొంత కాలం కిందట ఆమె భర్త చలపతిని వదిలేసి బీఎన్‌రెడ్డి కాలనీలో ఒంటరిగా ఉంటున్నారు. ఈ నెల 3వ తేదీన ఆమె స్థానికులకు కనిపించింది. అనంతరం కనిపించలేదు. శనివారం ఉదయం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో కిటికిలో నుంచి చూసిన స్థానికులు ఆమె మృతి చెంది ఉండటంతో మహిళా పోలీసు ద్వారా రూరల్ సీఐ కళా వెంకటరమణకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐతో పాటు ఎస్.ఐ. చంద్రమోహన్, ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బెంగళూరులో ఉన్న ఆమె కుమార్తెకు సమాచారం ఇచ్చారు. మృతురాలి సోదరుడు రాజును పిలిపించి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. మృతురాలు నేలపై వెల్లకిల పడి ఉండటంతో పాటు ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యులు కూడా సునీత మృతిపై తమకు అనుమానాలున్నాయని, లక్ష్మన్న అనే వ్యక్తి ఆమెను ఏమైనా చేసి ఉండవచ్చునని ఫిర్యాదు చేశారు. కుమార్తె మానస ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశామన్నారు. శరీరంపై ఎక్కడా గాయాలు లేకపోవడంతో అనారోగ్యంతో చనిపోయిందా.. లేక ఎవరైనా చంపేశారా..? ఆత్మహత్య చేసుకున్నారా? అన్న కోణాల్లో విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. శవపరీక్షల నివేదిక ఆధారంగా కేసు మార్పు చేస్తామని సీఐ తెలిపారు.

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్

వరద బాధితులకు ఆర్థిక సాయం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు బి.కొత్తకోట ఆదిత్య డిగ్రీ కళాశాల యాజమాన్యం రూ.35 వేలు ఆర్థిక సాయాన్ని అందించింది. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని శనివారం కలిసిన కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ చెక్కును అందజేశారు. సామాజిక సేవలో భాగంగా కళాశాల విద్యార్థులు వరద బాధితులకు ఆర్థిక సాయం చేయడం స్ఫూర్తిదాయకమని మంత్రి వారిని అభినందించారు.

వేసవి జలాశయం నుంచి నీరు

పీలేరు గ్రామీణ : పీలేరు పట్టణ ప్రజలకు కొత్తపల్లె వేసవి జలాశయం నుంచి తాగునీటి సరఫరా చేస్తామని పీలేరు ఈవో గురుమోహన్ అన్నారు. కొన్ని నెలలుగా ఇక్కడి నుంచి నీటి సరఫరా ఆగిపోయింది. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో శనివారం పంచాయతీ అధికారులు దీన్ని శుభ్రం చేశారు. డెడ్ స్టోరేజీలో ఉన్నందున మైక్రోఫిల్టర్‌ను ఉపయోగించి సిలికాన్ ఇసుకను ఫిల్టర్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈవో తెలిపారు. ఇందుకోసం నెల్లూరు నుంచి ఇసుక తెప్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. వారం రోజుల వ్యవధిలో నీటి సరఫరా చేస్తామని ఈవో చెప్పారు.



సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: మండలంలోని వేంపల్లె పంచాయతీ కన్నెమడుగువారిపల్లె గ్రామం బెంగళూరు రోడ్డులో చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. కాలనీ సమీపంలో దుర్వాసన వస్తోంది. అధికారులు పట్టించుకోవడం లేదు? **- సురేంద్ర, బెంగళూరురోడ్డు, మదనపల్లె**

✔: పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. **- మస్తాన్‌వల్లి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, మదనపల్లె**

?: బసినికొండ పంచాయతీ మున్సిపల్ బోర్డు వద్ద చెత్త, పేడదిబ్బలు పేరుకుపోయాయి. దోమలు, ఈగల నిలయంగా మారింది. వ్యర్థాలతో స్థానికులు అనారోగ్యాలబారిన పడుతున్నారు? **- వెంకటరమణ, బసినికొండ**

✔: చెత్తదిబ్బలు, పేడదిబ్బలు లేకుండా శుభ్రం చేయించి సమస్య లేకుండా చూస్తాం. **- విష్ణు, కార్యదర్శి, బసినికొండ**

?: వేంపల్లె పంచాయతీ కాలనీలోని మురుగు కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోయి, మురుగు ప్రవహించడం లేదు. వర్షం నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది? **- నారాయణ, వేంపల్లె**

✔: పారిశుద్ధ్య పనులు చేపట్టి కాలువలో మురుగు నీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటాం. **- వేంకటేశ్వర్లు, కార్యదర్శి**

?: మందబండ జగన్న కాలనీలోని టేకులపాళ్యానికి వెళ్లే మార్గంలో రోడ్డుపై అడ్డంగా మట్టిదిబ్బలున్నాయి. రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడుతున్నారు? **- రంగప్ప, చెంబుకూరు రోడ్డు, మదనపల్లె**

✔: రోడ్డుపై మట్టి దిబ్బలు లేకుండా తొలగించి దారి సౌకర్యం కల్పిస్తాం. **- శ్రీహరి, ఈవోపీఆర్డీ, మదనపల్లె**

?: మండల కేంద్రం నిమ్మనపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్లకొమ్మలు విద్యుత్తు తీగలపై పడుతున్నాయి. చెట్టు మొదలు పాఠశాల ఆవరణలో ఉంది. పొరబాటున విద్యుత్తు ప్రవహిస్తే ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది? **- బాషా, నిమ్మనపల్లె**

✔: చెట్టుకొమ్మలు విద్యుత్తు తీగలపై ఉండడం ప్రమాదకరం. కొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- పద్మావతి, ఎంఈవో-I, నిమ్మనపల్లె** - న్యూస్‌టుడే, నిమ్మనపల్లె

?: పీటీఎం బ్యాంకుకు వెళ్లే దారిలో చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు? **- బాషా, స్థానికుడు**

✔: రెండు రోజుల్లో చెత్తకుప్పలు తొలగించి దుర్వాసన వెదజల్లకుండా బ్లీచింగ్ పౌడిని వేయిస్తాం. **- మహబూబ్‌బాషా, పంచాయతీ కార్యదర్శి, పీటీఎం** - న్యూస్‌టుడే, పీటీఎం

మనస్తాపంతో తెదేపా కార్యకర్త మృతి

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డిని పోలీసులు శనివారం అరెస్టు చేసి మదనపల్లె టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నియోజకవర్గంలోని ఆయన అనుచరులు పార్టీ కార్యకర్తలకు సమాచారం అందడంతో పార్టీ అభిమానులు ఆయన అనుచరులు మదనపల్లె వద్దకు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని కాయలవాండ్లపల్లెకు చెందిన సూర్యనారాయణ ద్విచక్ర వాహనంపై తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా ఎంత సేపటికీ కొండ్రెడ్డిని పోలీసులు తీసుకురాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడని తెలిపారు. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. పోలీసులు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా మదనపల్లె నుంచి బి.కొత్తకోట మీదుగా ములకలచెరువు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యూట్యూబర్‌పై దాడి

ములకలచెరువు, న్యూస్‌టుడే : ఓ యూట్యూబ్ ఛానల్ విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణ రహితంగా దాడి చేసి, సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శనివారం ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు... గుర్రంకొండ మండలం, సరిమడుగు గ్రామానికి చెందిన రమేష్ ఓ న్యూస్ ఛానల్ సీఈవోగా ఉన్నారు. శనివారం ములకలచెరువులో తెదేపా నాయకుడు కొండ్రెడ్డి అరెస్టు వార్తను చిత్రీకరించుకుని మదనపల్లెకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పెద్దపాళ్యం వంతెన సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి విచక్షణా రహితంగా కొట్టి కెమెరా, చరవాణి, లోగోను లాక్కెళ్లినట్లు పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వాటి విలువ సుమారు రూ.4 లక్షలుంటుందని నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఘటనపై ములకలచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాఫిక్ ఎస్.ఐ.గా శివకామిని



మదనపల్లె నేరవార్తలు: మదనపల్లె ట్రాఫిక్ ఎస్ఐగా **శివకామినిని** నియమిస్తూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎస్పీ తమను నియమించారన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వాహన చోదకులు సహకరించి రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు సిబ్బంది అభినందించారు.

మామ, అల్లుడికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో మామ, అల్లుడు గాయపడిన ఘటన గుర్రంకొండ మండలంలో శనివారం జరిగింది. మదనపల్లె మండలం కృష్ణాపురానికి చెందిన రవీంద్ర (48) గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ పాయలవారిపల్లెకు చెందిన అల్లుడు చక్రవర్తి (30) ఇంటికి వెళ్లాడు. శనివారం మామా అల్లుళ్లిద్దరూ ద్విచక్ర వాహనంపై మదనపల్లెకు వస్తుండగా చెర్లోపల్లె సమీపంలో అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని గుర్రంకొండ పోలీసులకు తెలియజేశారు.

శ్రీగంధం చెట్లు నరికివేత

ములకలచెరువు, న్యూస్‌టుడే: గుర్తు తెలియని దుండగులు శ్రీగంధం చెట్లు నరికిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. ములకలచెరువు మండలం, కదిరినాథునికోట పంచాయతీ, గాలేటివారిపల్లికు చెందిన ఇ.కృష్ణప్పకు గ్రామం పక్కనే పొలం ఉంది. తన కుమారుడి సమాధి చుట్టూ శ్రీగంధం చెట్లు నాటారు. చెట్లు పెద్దవి కావడంతో వారం రోజుల క్రితం ఈ చెట్లు సగం నరికి వదిలేశారు. ఈ ఘటనపై కృష్ణప్ప వారం రోజుల క్రితమే పోలీసులు సమాచారం అందించారు. అయితే వారం రోజుల తరువాత శుక్రవారం రాత్రి దుండగులు కొన్ని చెట్లు నరికేయగా మరో చెట్టును సగం నరికి వదిలేశారు. ఈ ఘనటపై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

సా...గుతున్న రైల్వే వంతెన పనులు

✤ దుమ్ముతో పీలేరు పట్టణం విలవిల ✤ ట్రాఫిక్ అంతరాయంతో ముప్పుతిప్పలు



పీలేరులో జరుగుతున్న రైల్వే వంతెన నిర్మాణ పనులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరు పట్టణం బళ్లారి- నాయుడుపేట, చెన్నై- హైదరాబాదు జాతీయ రహదారులకు కేంద్ర బిందువుగా ఉంది. ఇదే మార్గాల్లో నిత్యం వందలాదిగా ఆర్టీసీ, ప్రైవేటు, కార్గో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో పీలేరు పట్టణం చిత్తూరు, మదనపల్లె మార్గాల్లో రైల్వే మార్గం వెళుతోంది. రైళ్ల రాకపోకల సందర్భంగా రెండు ప్రాంతాల్లో రైల్వే గేట్లు వేస్తారు. ఇదే సమయంలో ఈ మార్గాల్లో వందలాదిగా వాహనాలు కిలోమీటర్ల కొద్దీ బారులు తీరి నిలబడుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

రూ.73.95 కోట్ల నిధులతో నిర్మాణం

పీలేరు పట్టణంలో రైల్వే గేట్ల కారణంగా నెలకొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వ నిధులతో రెండు రైల్వే గేట్ల వద్దా రెండు వంతెనలు మంజూరు కావడంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. మదనపల్లె మార్గంలో రూ.37.54 కోట్లు, చిత్తూరు మార్గంలోని రూ.36.41 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో వాహనదారులు, పీలేరు ప్రజలు దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యకు పరిష్కారం అవుతున్నందుకు సంబర పడ్డారు. రెండేళ్ల పూర్తి కావస్తున్నా ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి.

రెండేళ్లుగా దుమ్ముతో సహవాసం

ఈ రెండు రైల్వే వంతెనల నిర్మాణంలో భాగంగా ఉన్న రహదారులు తవ్వేసి పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. ఈ పనులు రెండేళ్లుగా కొనసాగుతుండడంతో వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి నిండపోతోంది. ఈ మార్గాల్లో స్థిర నివాసాలు, వ్యాపారాలు చేస్తున్న వారు దుమ్ము కాలుష్యంతో విలవిలలాడిపోతున్నారు. రోడ్డు నిర్మాణ నిర్వాహకులు దుమ్ము లేయకుండా రోడ్డు వెంట నీళ్లు పట్టినా అది తాత్కాలికమే అవుతోంది. ఒక గంట అనంతరం రోడ్డుపై తేమ ఆరిపోయి యధావిధిగా దుమ్ము, ధూళి మళ్లీ రాజ్యమేలుతోంది. సమీపంలోని ఇళ్లను చుట్టేస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా రంగు మారి భయానకంగా మారుతోంది. రెండేళ్లుగా ముప్పుతిప్పలతో పాటు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

గడువులోగా పనులు పూర్తి

ఈ పనులు పూర్తి చేయడానికి జులై 2025 వరకు గడువు విధించారు. సంబంధిత గుత్తేదారు సంస్థతో సంప్రదింపులు జరుపుతున్నాం. గడువులోగా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- నాగరాజ, డీఈ, నేషనల్ హైవే, తిరుపతి



ట్రాఫిక్ అంతరాయంతో రోడ్డుపై బారులు తీరిన వాహనాలు

డివిజన్ వ్యాప్తంగా వర్షం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: డివిజన్‌లోని 10 మండలాల్లో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. డివిజన్ కేంద్రమైన మదనపల్లెలో 24 మి.మీటర్లు నమోదుకాగా, నిమ్మనపల్లెలో 17.4 మి.మీ, కురబలకోటలో 15 మి.మీ, బి.కొత్తకోటలో 20 మి.మీ, తంబళ్లపల్లెలో 33 మి.మీ, పెద్దతిప్పసముద్రంలో 35 మి.మీ, ములకలచెరువులో 29.6 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. కొండలు, గుట్టలపై ఉన్న ఇందిరమ్మ కాలనీలతో పాటు జనన్న కాలనీల్లో, పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురదగా అధ్వానంగా మారాయి. బండకాడపల్లె, తిప్పారెడ్డిగారిపల్లె, కొత్తపల్లె వద్ద దెబ్బతిన్న రోడ్డుపై గుంతల్లో వర్షపునీరు నిలిచింది.

సీట్ల కేటాయింపులో అన్యాయం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : డిగ్రీ కోర్సుల్లో సీట్ల కేటాయింపులో విద్యార్థినులకు అన్యాయం చేశారని అంబేడ్కరిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ షఫి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థినులు సుకన్య, మాధవి, గౌతమి, అగ్రహారం నందిని, జి.నందిని, ముస్కాన్, డి.నందినిలు కంప్యూటర్ సైన్స్‌లో సీటు కావాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే వారికి కంప్యూటర్ సైన్స్‌లో సీటు ఇవ్వకుండా ఫిజిక్స్‌లో సీట్లు కేటాయించారన్నారు. దీనిపై విద్యార్థినులు ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళితే ఈనెల 3, 4 తేదీల్లో గ్రూపు మార్చుకునే వెసులుబాటు ఉందని చెప్పిన ప్రిన్సిపల్ దీనిపై అడిగితే విద్యార్థినులను బెదిరించి ఫిజిక్స్ విభాగంలోనే ఉంచారని ఆరోపించారు. దీని వల్ల విద్యార్థినులు ఫిజిక్స్ చదవలేక, తాము కోరుకున్న సబ్జెక్టులో చేరలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై కళాశాల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు కోర్సు మార్చకుంటే ఆందోళన చేయాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

రహదారిపై ఆక్రమణలు తొలగించండి

గుర్రంకొండ, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగులు కొందరు తమ పలుకుబడిని ఉపయోగించి రహదారిని ఆక్రమించారని ఆక్రమణలు తొలగించాలని స్థానిక తెదేపా నేతలు మాజీ సర్పంచి నౌషాద్ అహ్మద్ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. కదిరాయచెరువు రోడ్డులోని మసీదుకు సమీపంలోని బీడు భూమిలో ఇది వరకు రైతుల పొలాలకు వెళ్లే రహదారిని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఆక్రమించి చదును చేస్తున్నారన్నారు. ఈ భూమిని ఇప్పటికే పక్కా గృహాల నిర్మాణానికి ఎంపిక చేసి కలెక్టరు కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారన్నారు. ఆ భూమిని ఇప్పుడు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఆక్రమిస్తున్నారని వారు చెప్పారు. ఆ పొలానికి పక్కన 10 మంది రైతులున్నారని, వారిని ఆ దారిలో పోకుండా బెదిరిస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని వారు అధికారులను కోరారు. తహసీల్దారు శ్రీనివాసులు చొరవ తీసుకుని వెంటనే విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని వీఆర్వో అన్వర్‌బాషాను ఆదేశించారు. నివేదిక వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు.



గుర్రంకొండ తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న తెదేపా నేతలు

దిగువపాళెంకు బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసు ప్రారంభంలో తెదేపా నాయకులు కామకోటి ప్రసాదరావు, తెట్టు ఉప సర్పంచి బొగ్గు భాస్కర్, నాయకులు

తెట్టు (కురబలకోట), న్యూస్‌టుడే : మదనపల్లె నుంచి తెట్టు మీదుగా దిగువపాళెంకు కొత్త బస్సు సర్వీసును జ్ఞానోదయ విద్యా సంస్థల ప్రిన్సిపల్, తెదేపా నాయకులు కామకోటి ప్రసాదరావు శనివారం ప్రారంభించారు. ఈ బస్సు కోటకాడఇండ్లు, ఆరోగ్యపురం, దిగువపాళెం, తెట్టు మీదుగా మదనపల్లెకు తిరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోర్కెను తెదేపా హయాంలో రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. ఉప సర్పంచి బొగ్గు భాస్కర్, ఉత్తరాది శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ తిమ్మరాయుడు, కామకోటి రాజ, గాలేటి వెంకటరెడ్డి, గోపాలకృష్ణ, రెడ్డెప్పరెడ్డి, గంగిరెడ్డి, శివనారాయణ, వాసు, సుధాకర్, భాజపా, జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, భరత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో పతకం సాధించాలి

కలకడ, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో గెలిచి పతకం సాధించాలని ప్రధానోపాధ్యాయుడు చెంగల్‌రాయుడు విద్యార్థులకు సూచించారు. మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీలలో జిల్లాస్థాయిలో గెలిచి, రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఎంపికైనారు. శనివారం పాఠశాలలో వ్యాయామోపాధ్యాయురాలు ఝాన్సీరాణి ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి హాజరైన హెచ్ఎం 20 మంది క్రీడాకారులకు తన సొంత నిధులు రూ.11 వేలతో క్రీడా దుస్తులు అందజేశారు.



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న హెచ్.ఎం. చెంగల్‌రాయుడు

అన్నపూర్ణగా జగజ్జనని దర్శనం

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం జగజ్జనని అన్నపూర్ణగా దర్శనమిచ్చారు... మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలోని ఆలయాల్లో అమ్మవారు చేతిలో రసపాత్రను ధరించి ఎరుపు, పసుపు, నీలంరంగు దుస్తుల్లో అన్నపూర్ణగా కొలువై దర్శనమిచ్చారు. ఆదిభిక్షువైన ఈశ్వరుడికి భిక్ష పెట్టిన దేవత అన్నపూర్ణ. సకల శుభాలను కలిగించే ఆ తల్లిని కొలిచిన వారికి ఆకలి బాధలుండవని ప్రతీతి. తల్లని పుష్పాలతో కొలిచి అన్నాన్ని నైవేద్యంగా అమ్మవారికి సమర్పించారు. ఆయా ఆలయాల్లో శక్తి స్వరూపిణి దర్శనమిచ్చిన రూపాలివి.

- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం



కంభంవారిపల్లెలో అన్నపూర్ణదేవిగా చౌడేశ్వరమ్మ




పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న బి.కొత్తకోట కన్యకాపరమేశ్వరిదేవి



కలకడ కోనలో అన్నపూర్ణదేవి అలంకరణలో శ్రీచౌడేశ్వరీదేవి



వాల్మీకిపురం మండలం గండబోయనపల్లెలో అన్నపూర్ణేశ్వరీ దేవి అలంకరణలో సత్యమ్మ తల్లి



అన్నపూర్ణేశ్వరీ దేవి అలంకారంలో కలికిరి ఎల్లమ్మ

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

చక్కెరవాండ్లపల్లె (కలికిరి), న్యూస్‌టుడే: కలికిరి మండలం చక్కెరవాండ్లపల్లెలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్లను శోభాయమానంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణలతో స్వామి వారికి కల్యాణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



చక్కెరవాండ్లపల్లెలో కొలువైన కల్యాణమూర్తులు

చట్టాలపై అవగాహన అవసరం

పీలేరు, న్యూస్‌టుడే: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని ఆత్మస్థైర్యంతో తమను తామే రక్షించుకోవాలని పీలేరు 11వ జిల్లా అదనపు న్యాయమూర్తి కె.మహేష్ అన్నారు. శనివారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయసేవా ప్రాధికార సంస్థ సంయుక్తాధ్వర్యంలో పీలేరు మండలం తలపులలో మహిళా విజ్ఞాన సదస్సు జరిగింది. సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ... గ్రామీణ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకొని ఇతరులకు భయపడకుండా సమాజంలో రాణించాలని సూచించారు. మహిళలకు కుటుంబం ఆస్తిలో చట్టపరంగా తమ వాటా తీసుకునేందుకు హక్కు ఉందని, భర్త నుంచి భరణం పొందే విషయంలో కూడా చట్టంలో వెసులుబాటు కల్పించినట్లు వివరించారు. న్యాయవాదులు ఎల్లయ్య, రాణి మహిళా చట్టాలను గురించి వివరించారు. న్యాయసేవ ప్రాధికార సంస్థ వారి జూట్ సంచులతో కిట్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సిబ్బంది తలపుల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని మదనపల్లెకు చెందిన న్యాయవాది ఎల్.బాలజ్యోతి పిలుపునిచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం బి.కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ... మహిళలు వేధింపులకు గురికాకుండా చట్టాలు అండగా నిలుస్తాయని గుర్తు చేశారు. వెలుగు ఏపీఎం రాజేశ్వరి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శేషాద్రిబాబులతో పాటు మహిళలు ఇందులో పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం

పీలేరు, న్యూస్‌టుడే: చిన్నపిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని బాలకార్మికవ్యవస్థను ప్రోత్సహించరాదని పీలేరు కార్మికశాఖ అధికారి కె.ఆనందబాబు తెలిపారు. శనివారం 'ఆపరేషన్ స్వేచ్ఛ' కార్యక్రమంలో భాగంగా బాల కార్మిక విముక్తిలో భాగంగా ఆయన పీలేరు పట్టణంలోని హోటళ్లు, దుకాణాల నిర్వాహకులకు బాల కార్మికులను ప్రోత్సహించరాదని అవగాహన కల్పించారు. చట్టప్రకారం పద్దెనిమిదేళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం, వారి చేత పనులు చేయించడం నేరమని స్పష్టం చేశారు. వెట్టిచాకిరి చేస్తున్న పిల్లలున్నట్లయితే వారిని పాఠశాల్లో చేర్పించి వసతి గృహంలో ఉచిత వసతి కల్పిస్తామన్నారు. పీలేరు ఏఎస్ఐ హేమసుందర్, సాంఘిక సంక్షేమశాఖ సిబ్బంది, గ్రేట్ విజన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు జీవీఎస్ బాబు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె ఎక్సైజు స్టేషన్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాలకు ఈనెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజు సీఐ భీమలింగ తెలిపారు. మదనపల్లె ఎక్సైజు స్టేషన్ పరిధిలో 22 దుకాణాలు ఉండగా అందులో పట్టణంలో 10, గ్రామీణ ప్రాంతం పరిధిలో 4, నిమ్మనపల్లె 1, రామసముద్రం 1, కురబలకోట 3, బి.కొత్తకోట 3 మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

సేంద్రియ సాగు లాభదాయకం

కలికిరిగ్రామీణ, న్యూస్‌టుడే: రైతులు కృత్రిమ పురుగు మందులు, తెగుళ్ల మందులు వాడకంపై ఖర్చు తగ్గించి సేంద్రియ పద్ధతులతో సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని కేవీకే సమన్వయకర్త మంజుల రైతులకు సూచించారు. శనివారం స్థానిక కేవీకేలో ప్రధానమంత్రి కిసాన్ నిధుల విడుదల ప్రత్యక్ష కార్యక్రమాన్ని రైతులతో కలసి వీక్షించారు. కిసాన్ సమ్మాన్ సమ్మేళన్ కార్యక్రమం ద్వారా 18వ విడత పంటసాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా కూలీల కొరతను అధికమించేందుకు యంత్రీకరణను ఉపయోగించాలని సూచించారు. రైతులు ఉత్పత్తి, మార్కెటింగ్‌కు టెక్నాలజీని జోడిస్తే వ్యవసాయం, అనుబంధ రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని భాజపా కిసాన్‌మోర్చ జోనల్ ఇన్‌ఛార్జి కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్‌కుమార్, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో జాప్యమెందుకు?

మదనపల్లె పట్టణం, గుర్రంకొండ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో జాప్యమెందుకు జరుగుతుందో ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ ప్రశ్నించారు. శనివారం మదనపల్లె పట్టణం, గుర్రంకొండ ప్రాంతాల్లో పర్యటించారు. మదనపల్లె ఇందిరానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 నెలలు పూర్తయినా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని మహిళలందరు అడుగుతున్నారన్నారు. తల్లికి వందనం పథకం ప్రతి ఆడబిడ్డకు రూ.15 వేలు ఇస్తామన్న ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదన్నారు. 2029లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి క్షేత్రస్థాయి నుంచి బలోపేతం కావాలని, దీనికి నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ జనరల్ సెక్రటరీ అల్లాబకష్, నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మీనాకుమారి, ముబారక్, ఖాదర్‌బాషా, సోమశేఖర్, శరత్‌కుమార్‌రెడ్డి, ఈశ్వరమ్మ, నాగరాజు, మెహమ్మద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



మయూర స్వీట్స్ అండ్ బేకరి దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

బేకరిని ప్రారంభించిన ఎమ్మెల్యే

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : బెంగళూరు బస్టాండులో ఏర్పాటు చేసిన మయూర స్వీట్స్ అండ్ బేకరి దుకాణాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన రుచికరమైన మిఠాయిలు, బేకరి తినుబండారాలు అందుబాటులో ఉండే విధంగా దుకాణాన్ని ప్రారంభించారని చెప్పారు. దుకాణం యజమాని నిషాంత్, తెదేపా నాయకులు విద్యాసాగర్, నాగార్జున బాబు, బాలుస్వామి పాల్గొన్నారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ముగిసిన అంతర్ జిల్లాల తైక్వాండో పోటీలు


ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

రైల్వేకోడూరు గ్రామీణ. న్యూస్‌టుడే: మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రారంభమైన అంతర్ జిల్లాల తైక్వాండో పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్జీఎఫ్ క్రీడల కార్యదర్శి శారద మాట్లాడుతూ.. బాలురు విభాగంలో 10, బాలికల విభాగంలో 11 మందిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు మధ్యప్రదేశ్‌లో డిసెంబరులో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్ననున్నట్లు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట అన్నమాచార్య బీఎడ్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీలో పని చేస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల ఔన్నత్యాన్ని, సమాజానికి వారు చేస్తే సేవలను బీఎడ్ ప్రిన్సిపల్ బి.జయరాంరెడ్డి కొనియాడారు. కళాశాల అధ్యాపకులు ఉత్తమయ్య, వనజాక్షమ్మ, డాక్టర్ రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య, శ్రీధర్, రామకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జయరాంరెడ్డి

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రైల్వేకోడూరు పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ హేమసుందర్‌రావు, ఎస్.ఐ.నవీన్‌బాబు తెలిపారు. మైసూరువారిపల్లె మామిడికాయల యార్డు వద్ద రాజంపేట మండలం బోయినపల్లెకు చెందిన టి.శేఖర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని.. అతని నుంచి 1,250 గ్రాములు, పట్టణంలోని జీపీ కాలనీకి చెందిన దండు హర్షిత్‌తోపాటు ఆయన భార్యను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా 14 రోజుల రిమాండు విధించినట్లు అధికారులు వివరించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ హేమసుందర్‌రావు, ఎస్.ఐ.నవీన్‌బాబు

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా జయప్రకాష్


జయప్రకాష్

రాయచోటి, సుండుపల్లి, న్యూస్‌టుడే: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారిక అధికారిగా పీలేరులో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో సుండుపల్లి వసతి గృహ సంక్షేమ అధికారిగా పని చేశారు. ప్రస్తుతం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి జరిమానా

రాయచోటి, న్యూస్‌టుడే: పట్టణంలోని వివిధ ప్రాంతాలలో శనివారం ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 11 మంది పట్టుబడగా వారిని కోర్టుకు హాజరు పరచగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అసీఫా సుల్తాన్ రూ.10,500 చొప్పున జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన మెహతాజ్ బేగం

రైల్వేకోడూరు : రాష్ట్ర మైనారిటీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసినట్లు ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ మెహతాజ్ బేగం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన్ను కలిసి రైల్వేకోడూరులో పరిస్థితులపై వివరించామన్నారు. అనంతరం మంత్రిని సత్కరించినట్లు చెప్పారు.

జిల్లా కేంద్రం... సమస్యలతో సతమతం

గత వైకాపా ప్రభుత్వ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

రాయచోటి పేరుకు జిల్లా కేంద్రం. కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలక పరిధిలో 34 వార్డులు, సుమారు 31 వేల నివాసాలు ఉన్నాయి. లక్షా 20 వేల మంది జనాభా ఉన్నారు. మౌలిక వసతులు మాత్రం అరకొరగానే ఉన్నాయి. తీవ్ర తాగునీటి సమస్య, అపారిశుద్ధ్యం, అధ్వాన రహదారులు, ట్రాఫిక్ సమస్య ఇలా ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తాయి. మౌలిక వసతుల కల్పనకు గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి వరించచడంతో జిల్లా కేంద్రం అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తాండవిస్తున్న అపారిశుద్ధ్యం


మహబూబ్‌నగర్ వీధిలో మురుగునీటి నిల్వలు

పురపాలక పరిధిలో పూర్తి స్థాయిలో మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడం.. ఉన్నవి దెబ్బతినడంతో ఎక్కడ చూసినా మురుగు నిల్వలే దర్శనమిస్తాయి. మురుగు రోడ్లపై పారుతూ ఖాళీ స్థలాల్లో నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఎటు చూసినా అపారిశుద్ధ్యం నెలకొంటోంది. ఇప్పటి వరకు సుమారు 197 కి.మీ మురుగు కాలువల నిర్మాణం చేపట్టగా ఇంకా 26 కి.మీ మేర కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

ట్రాఫిక్‌తో సతమతం


గాంధీ బజారు వీధిలో ట్రాఫిక్ కారణంగా నిలిచిన వాహనాలు

పట్టణంలో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు విస్తరణ చేపట్టకపోవడం, ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తుండటం, వాహనదారులు తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తుండటంతో సమస్య అధికమైంది. ట్రాఫిక్‌ను నియంత్రించడం పోలీసులకు తలకుమించిన భారమవుతోంది.

వసతుల కల్పనకు ప్రభుత్వానికి ప్రజల విజ్ఞప్తి

తీవ్ర తాగు నీటి ఎద్దడి


ప్రైవేట్ ట్యాంకు వద్ద నీటిని కొనుగోలు చేస్తున్న పుర ప్రజలు

రాయచోటిలో తరచూ తాగునీటి సమస్య ఉత్పన్నమవుతూనే ఉంది. పట్టణ వాసులకు ప్రధాన నీటి వనరైన వెలిగల్లు జలాశయం నుంచి పట్టణ ప్రజల అవసరాలకు ప్రతి రోజు 2 కోట్ల లీటర్ల తాగునీరు అవసరం అవుతుంది. ప్రస్తుతం 90 లక్షల లీటర్ల నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు. అవసరాలకు సరిపడా నీటి సరఫరా జరగడం లేదు. సరఫరాలో సుమారు 20 శాతం మేర నీరు వృథాగా పోతోంది. ఫలితంగా రోజు వేల లీటర్ల నీరు వృథా అవుతోంది. పైపులైన్లు పగిలిపోవడం, వాల్వ్‌ల నుంచి లీకేజీలు, ప్రజల నిర్లక్ష్యం కారణంగా నీరు ఎక్కువ వృథా అవుతోంది.

అధ్వాన రహదారులు


రాజు స్కూల్ వీధిలో రోడ్డు దుస్థితి


జిల్లా కేంద్రంలో చాలా వీధులు సీసీ రోడ్లకు నోచుకోలేదు. మట్టిదారులే దర్శనమిస్తున్నాయి. పురపాలక పరిధిలో 146 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 106 కి.మీ మాత్రమే నిర్మాణం చేపట్టారు. ఇంకా 40 కి.మీ మేర సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ముఖ్యంగా మాసాపేట, కొత్తపల్లె, రాజు స్కూల్ వెనుక వీధులు, పాత రాయచోటి, బోస్‌నగర్, పీటీఎం పల్లె, మహబూబ్‌నగర్ వీధి ప్రాంతాల్లో ఎక్కువగా మట్టి రోడ్లు ఉన్నాయి.

అర్చకులకు వేతనాల పెంపు హర్షణీయం


మాట్లాడుతున్న భాజపా ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు

రాయచోటి : ఆలయ అర్చకుల వేతనాలు, దీపదూప నైవేద్యాలకు ఇచ్చే సాయాన్ని కూటమి ప్రభుత్వం పెంచినట్లు భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు పేర్కొన్నారు. రాయచోటి కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. భాజపా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని.. అర్చకులకు రూ.పది వేలు, దీప దూప నైవేద్యాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ నిర్మల్‌కుమార్, జిల్లా కార్యదర్శి కృష్ణయాదవ్, జల్లా అధికార ప్రతినిధి పాలగిరి శ్రీనివాసరాజు, రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు మహమద్ షబ్బీర్, శ్రీనివాస యాదవ్, లోకేశ్ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన చమర్తి


మంత్రి నారా లోకేశ్‌తో తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి నారా లోకేశ్ సూచించారని తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ఈ మేరకు ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో శనివారం మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన చెప్పారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేస్తోందని.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గాలివీడు, న్యూస్‌టుడే: చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని న్యాయమూర్తి ఫైజున్నిషా పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం మండల న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది, మహిళా పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన


వేరుశెనగ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి మండలం దిగువ అబ్బవరంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ శ్రీధర్ చామకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులతో మాట్లాడారు. గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ప్రతి రైతు తమ పంటలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రనాయక్ జిల్లాలో జరుగుతున్న ఈ-పంట నమోదు వివరాలను కలెక్టర్‌కు వివరించారు. వ్యవశాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీలత, ఆ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించండి


విద్యార్థులకు సూచనలిస్తున్న జిల్లా అయిదో అదనపు కోర్టు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి

రాయచోటి, న్యూస్‌టుడే: స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర, బాలికల వసతి గృహాలను శనివారం జిల్లా అయిదో అదనపు కోర్టు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి తనిఖీ చేశారు. వసతి గృహాలలో రికార్డులు పరిశీలించారు. మరుగుదొడ్లు, వంటగదులు అపరిశుభ్రతగా ఉంచకూడదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వసతి గృహాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సంక్షేమ అధికారులను ఆదేశించారు.

సామాజిక తనిఖీలో అవినీతి బట్టబయలు

రామాపురం, న్యూస్‌టుడే: మండలంలోని 13 గ్రామ పంచాయతీలో ఏడాది పాటు జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సామాజిక తనిఖీలు నిర్వహించగా దాదాపు రూ.రెండు లక్షల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించామని ఎస్సార్పీ సుబ్బారావు తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో శనివారం ఏపీడీ ప్రతాప్, ఎస్టీఎం లోకేశ్వరమ్మ, విజిలెన్స్ అధికారి సుధాకర్లలు గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఏడాదిగా 2,293 పనులు చేపట్టారన్నారు. అన్ని పంచాయతీలకు గాను రూ.1.82 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో జాషువా, డీఆర్పీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కాకూడదు



మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి, న్యూస్‌టుడే: కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలగాలని ర్యాగింగ్ రహిత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ర్యాగింగ్, మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్రమశిక్షణతో చదువుపై శ్రద్ధ కనబరిచి సమాజంలో గుర్తింపును సాధించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని వివరించారు. అనంతరం ర్యాగింగ్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ బాలాజీ, సీఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పనిచేసే చోటే నివాసముంటే ఉత్తమ ఫలితాలు : ఎస్ఈ


అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

రాజంపేట, న్యూస్‌టుడే: ఉద్యోగులు పనిచేసే ప్రాంతంలోనే నివాసముంటే వృత్తిరీత్యా ఆశించిన ఫలితాలు సాధించవచ్చునని విద్యుత్తు శాఖ ఉమ్మడి కడప జిల్లా ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. స్థానిక విద్యుత్తు డివిజన్ కార్యాలయంలో శనివారం రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అయిదు మండలాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మొండి బకాయిలున్నవారికి రెడ్ నోటీసు జారీ చేయాలన్నారు. విద్యుత్తు ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు లైన్లను గుర్తించి సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రాజశేఖర్‌రెడ్డి, డిఈఈ సురేంద్ర, ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.


రైల్వేకోడూరులో అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు


రాజంపేటలో కోలాటమాడుతున్న మహిళలు


లక్కిరెడ్డిపల్లెలో సర్వమంగళాదేవిగా...

వనమహాలక్ష్మీ... సదాస్మరామి

శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా మూడో రోజు శనివారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాయచోటిలోని కొత్తపేటలో అమ్మవారు వనమహాలక్ష్మీదేవిగా కొలువుదీరారు. రైల్వేకోడూరు పట్టణంలోని అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వీరబల్లిలో కన్యకాపరమేశ్వరిని అన్నపూర్ణాదేవిగా పండ్లతో అలంకరించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం



రాయచోటి గాంధీబజార్‌లో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో...


వీరబల్లిలో అన్నపూర్ణాదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి


చిన్నమండెం అమ్మవారిశాలలో మణిదీపవర్ణ అలంకారంలో కన్యకా పరమేశ్వరీదేవి


సుండుపల్లిలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు